


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

"నిజంగా అంత కష్టపడాలా?"

"నీకు తెలీదు అశ్వత్థామా. పోలీసు డిపార్టుమెంట్‌లో పనిచేశాను. నాకు తెలుసు ఇంటలిజెన్స్ డిపార్టుమెంట్ తల్చుకుంటే ఎంత లోతుకయినా వెళ్ళగలదు".

"ఆ కార్తికేయ ఊళ్ళో ఉన్నాడా?"

"ఉండటం ఏమిటి? ఈ రోజే శోభనం"

"శోభనమా– హ్హాహ్హాహ్హా" బిగ్గరగా నవ్వాడు అశ్వత్థామ. "రిజిస్ట్రార్ ఆఫీసు లోనే చెయ్యెత్తి సంతకం పెట్టలేని దాంతో శోభనమా" అంటూ ముందుకు తూలి, మందు ఎక్కువై స్పృహ తప్పిపోయాడు.

2

**మనసు** గదిలో మమతల మంచం వేసి, విరహం దుప్పటి మీద మౌనాన్ని మల్లెలుగా జల్లి, కోర్కెల అగరొత్తుల్ని బిడియం అరటిపండుకి గుచ్చి, ఉద్వేగం గడప అవతల్నుంచి వినిపించే అన్యోన్యపు అడుగుల చప్పుడు కోసం వరుడు ఎదురు చూసే దినం, శోభనం. చిన్న తేడాతో వాళ్ళకీ అలాగే జరిగింది. అతడు బయట్నుంచి వచ్చాడు. ఆమె లోపల ఉంది. అంతే తేడా.

"పాల గ్లాసు కూడా మీరే పట్టుకొస్తారని సిగ్గుతో చచ్చిపోయాను" అంది. అతడొచ్చి పక్క అంచుపై కూర్చున్నాడు. ఆ పక్క అతడు సర్దిందే. ఆ పూలు అతడు ఏర్పాటు చేసినవే. అసలు ఈ ఏర్పాట్లకి ఆమె ఒప్పుకోలేదు. 'ఈ శవానికి శోభనం ఒకటి కావల్సి వచ్చిందా? అని అందరూ నవ్వుకుంటారు' అంటూ ససేమిరా వద్దంది.

"మనం బ్రతికేది వాళ్ళకోసం కాదు కళ్యాణీ. మన కోసం. సరే నువ్వు అంతగా చెపుతున్నావు కాబట్టి అలంకరణ నేనే చేస్తాలే"

ఆమె ఆశ్చర్యంగా "ఏం చేస్తారు?" అని అడిగింది.

"చూస్తావుగా!"

ఆ రాత్రి పదింటికి అతడు దగ్గరకి వచ్చి ''కళ్ళు మూసుకో'' అన్నాడు. "మళ్ళీ నే చెప్పినప్పుడుగానీ తెరవకూడదు'' అని చేతుల మీద ఆమెని గాలిలోకి ఎత్తాడు. కెవ్వున అరచి ఆమె కళ్ళు) మూసుకుంది. తనని అతడు మెట్లమీదుగా పైకి తీసుకువెళ్ళటం తెలుస్తోంది. ముందు నెమ్మదిగా ప్రారంభమయిన మల్లెపూల పరిమళం క్రమంగా ఎక్కువైంది. అతడామెని పక్కమీద సుతారంగా దింపాడు.

ఆ తరువాత నిశ్శబ్దం. ఆమె ఒక్క నిముషం ఆగి, ''ఏవండీ. కళ్ళు తెరవచ్చా?'' అని అడిగింది. జవాబు లేదు. ''ఏవండీ, మీరిక్కడే ఉన్నారా?'' అనుమానంగా ప్రశ్నించింది. నిశ్శబ్దం ఉన్నానంది. ఆమె నెమ్మదిగా కళ్ళు విప్పింది.

ఆ అద్భుత దృశ్యానికి ఆమె కళ్ళతో పాటూ మనసు కూడా చెదిరింది. తన భర్త ఒక చిత్రకారుడని మర్చిపోయినందుకు తనని తానే నిందించుకుంది. అహర్నిశలూ శ్రమించిన ఆర్టు డైరెక్టర్ కూడా అంత బాగా తీర్చిదిద్దలేడు.

వెన్నెల దారాల్లా మంచానికి కట్టిన మల్లెపూల వరసలు, గచ్చు కలర్ కాంబినేషన్ తో కిటికీ తెరలూ, మంచు కొండల మధ్య చలి మంటలా తెల్లపక్క మీద ఎర్రగులాబీ పూలూ. 'శబ్దమా సడిచేయకు–వేకువా నన్ను లేపకు' అంటూ అగరొత్తుల పరిమళాన్ని ఆవహన చేసుకుంటున్న గాలీ, పొదివి పట్టుకుంటే అమ్మ కడుపులో ఉన్నంత ధైర్యంగా, ముద్దు పెట్టుకుంటే మనసులో మువ్వలు కదిలినంత అల్లరిగా, అంత బాగా... అందంగా... ఋషులు తపస్సు చేసుకునే గుహల్లో నీరవంలా... అప్సరసలు స్నానం చేసే కొలనులో అలజడిలా; యజ్ఞానికి వీలుగా, అలజడికి  అనువుగా ఉంది ఆ శోభనం గది.

'కుసుమ నిశిఖ శరతల్ప మనల్ప విలాస కళా కమనీయం– వ్రతమివ తవ పరిరంభ సుఖాయ కరోతి కుసుమ శమనీయం' అన్న పాట టేప్ లో వస్తోంది. ఇష్టపడిన పతిదేవుడు పక్కనుండగా అష్టపదుల జయదేవుడేల అని ప్రతి సతీ అనుకునేలా, ప్రాక్టికల్సు ఉండగా థియరీలేల అని అమ్మాయిలు పరీక్షలు మానేసి రుక్మిణీ కల్యాణం చదువుకుంటూ శ్రావణ శుక్రవారం నోములు నోచుకునేలా– ఒక్క మాటలో చెప్పాలంటే దామెర్ల రామారావు బొమ్మలా ఉంది ఆ గది.

అయిదు నిమిషాల తరువాత అతడు లోపలి కొచ్చేవరకూ ఆమె ఇంకా ఆ గదిలో సౌందర్యాన్ని ఆస్వాదిస్తూనే ఉంది. ఆమె అతడి వైపు ప్రేమగా చూస్తూ ''మీ కలర్ కాంబినేషన్స్ నిజంగా అద్భుతంగా ఉన్నాయి. మనమొక ఇంటీరియర్ డెకరేషన్ ఆఫీసు పెడ్తే ఏడాదిలో లక్షలు సంపాదించవచ్చు'' అంది.

అతడు తెరలు తెరలుగా నవ్వాడు. అతడంతగా నవ్వటం ఆమె ఎప్పుడూ చూడలేదు. ''హతవిధీ, మొదటి రాత్రి అమ్మాయి మాట్లాడాల్సిన మొదటి మాట అదా?'' అన్నాడు.

''నిజంగా నాకేం మాట్లాడాలో తెలీదండి. మీరే చెప్పండి.''

''వ్యాపారం అన్నావు కాబట్టి నీకో మంచి ప్రపోజల్ చెప్పనా? 'గణాంక శాఖ ఉద్యోగుల్ని నియమించి మొదటిరాత్రి ఏం మాట్లాడాలి? అన్న స్టాటిస్టిక్స్ కలెక్టు చేద్దాం. దీని మీద ఎవరయినా ఇన్వెస్టిగేటివ్ రచయిత చేత పుస్తకం వ్రాయించి

పబ్లిష్ చేస్తే బోలెడు డబ్బులు. శోభనం గదిలో మొట్టమొదటి మాట 'భయంగా ఉందా' అన్నవాళ్ళు నలభై శాతం, '...కూర్చో' అన్నవాళ్ళు నలభై శాతం, 'నేన్నీకు నచ్చానా?' అన్న మగవాళ్ళు పదిశాతం... ఇలా ఇండెక్సులు ఇద్దాం.''

''దానికి సమాధానంగా అమ్మాయిలు ఏమి చెప్పాలో కూడా ఇండెక్సు ఇద్దాం. '...భయమెందుకు? నాకేం లేదు. మీకుందా?' అని అడిగే అమ్మాయిలు నలభై శాతం, 'రాగానే కూర్చుంటే బావోదు. మీరే లేచి నిలబడండి' అన్నవాళ్ళు నలభై శాతం. 'నేన్నీకు నచ్చానా?' అన్న ప్రశ్నకి, 'రామకృష్ణకన్నా మీరే బావున్నారు' అన్నవాళ్ళు పదిశాతం...'' పెదవి క్రింద నవ్వుని నొక్కిపట్టి ఆమె అంటూ ఉంటే, ''బాబోయ్'' అంటూ అతను అరచిన అరుపుకి గది ప్రతిధ్వనించింది. ''నువ్వింత డైనమిక్ అనుకోలేదు సుమా'' అన్నాడు.

ఆమె సడన్‌గా విషాదంలోకి వెళ్ళింది. ''ఈ రాత్రి గురించి నేనెంత ఊహించుకున్నానో తెలుసా. How to fight your rivals in Business అన్న పుస్తక పాఠాన్ని 'ఈ రాత్రి బిజినెస్'లో మీ మీద ప్రయోగించాలనీ... రొమాన్సుకి కూడా ఇంటిలిజెన్స్ కావాలని నిరూపించి మీతో ఒప్పించాలనీ ఎంత అనుకున్నానో. దురదృష్టం...''

''ష్...'' ఆమె పెదవుల మీద చెయ్యిపెట్టి ఆపుతూ, ''అదే వద్దన్నాను. అన్నిటి కన్నా మొదటగా నువ్వు బాధ పడకూడదని షరతు పెట్టాను...'' అని ఇంకా చెపుతూ ఉండగా ఆమె బరస్ట్ అయి, ''బాధ పడకుండా ఎలా ఉండనండీ. కనీసం పాలగ్లాసు కూడా లోపలికి తీసుకురాలేని ఇంపొటెంట్‌ని. భుజం మీద ఆప్యాయంగా చెయ్యి కూడా వేయలేని అశక్తురాలిని...'' అంటూ బావురుమని, కానీ విజ్ఞురాలూ, ప్రపంచం చూసిన స్త్రీ కాబట్టి, బేలత్వం నుంచి వెంటనే బయటపడి ''ఐయామ్ సారీ–'' అంది.

''చూడు కళ్యాణీ. అంతా మనం అనుకోవటంలో ఉంది. లేనిదాని కోసం విచారించటం కన్నా ఉన్నదాన్ని ఉపయోగించుకోవటం ఎలా అని ఆలోచించటం మేలు. కాదంటావా?''

''ఏం ఆలోచించగలం? ఏం చెయ్యగలం? మీమీద భరించలేనంత ప్రేమ కలిగినప్పుడైనా కనీసం చుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కొని కౌగలించుకో లేను! అంత చిన్న కోరిక కలిగినప్పుడు కూడా మిమ్మల్ని 'దగ్గరకి రండి' అని నోరు తెరచి అడగాలి. 'భగవంతుడా! ఇంత నరకం మరే స్త్రీకి కల్గించకు తండ్రీ!' అని ఎలుగెత్తి ప్రార్థించాలని ఉందండీ నాకు...''

మెటీరియలిజపు పొరల అడుగు నుంచి లీలగా వినిపిస్తోన్న మనోలాలిత్యాన్ని చూసి అతడా క్షణం కదిలిపోయాడు. కానీ ఈ సమయంలోనే తను ధైర్యంగా ఉండాలి. ఆమెకి ధైర్యం చెప్పాలి. 'నీ వల్ల నేనిది కోల్పోయాను' అన్న అసంతృప్తి తనకి ఏమాత్రం లేదని ఆమెకి నమ్మకం కలిగించాలి. ఆ ఉద్దేశ్యంతో, ''చూడు కళ్యాణీ...'' అన్నాడు నవ్వుతూ. ''... పిలవటానికి నోరే అవసరం లేదు. కళ్ళు కూడా చాలు. మనిద్దరం ఒక కోడ్ ఏర్పాటు చేసుకుందాం.''

''కోడా?''

''అవును. సీక్రెట్ కోడ్. ఎడమకన్ను మూసి కుడికన్ను తెరిస్తే 'ముద్దు పెట్టుకోవాలని ఉంది'. కుడికన్ను మూసి ఎడమకన్ను తెరిస్తే 'ముద్దు పెట్టించుకోవాలని ఉంది'. ఒక రెప్ప టపటపా కొట్టుకుంటే 'నీ పక్కన పడుకోవాలని ఉంది'. పడుకున్నాక నాలుక లోపలికి బయటికి కదుపుతే....''

ఆమె మొహం సిగ్గుతో ఎర్రబడింది. ''షటప్'' అంది. ఎర్రబడిన మొహాన్ని చూసి వేదన ఏడామడల దూరం పారిపోయింది. అతడామె పక్కన చేరాడు. అయిదు నిముషాల తరువాత, ఆమె ఆలోచనల్నుంచి తేరుకున్నట్టుగా అంది– ''ఏవండీ! ఇంత మంచి కోడ్‌లు ఆలోచించగలిగిన మీరు బిజినెస్ ఫీల్డ్‌లోకి ఎందుకు రాలేదండీ. వస్తే లక్షలు... కోట్లు.''

''షటప్'' అన్నాడు.

శారీరక సంతృప్తే కాదు. 'నిశ్చింత' కూడా సంతృప్తినిస్తుంది. అరగంట తరువాత, ఆమె అన్నీ మర్చిపోయి నిద్రపోయాక అతడు పక్కమీద నుంచి లేచి కిటికీ దగ్గరకి వచ్చి బయటకు చూశాడు. క్రింద తోటలోంచి గాలి తెమ్మెర ఒకటి సానుభూతిగా పలుకరించి వెళ్ళింది.

''ఎన్ని ఊహించుకున్నానండీ ఈ రాత్రి గురించి'' ఆమె మాటలు గుర్తొచ్చాయి. ''వ్యాపారంలో ప్రత్యర్థితో పోట్లాడినంత ఏకాగ్రతతో పక్క మీద పార్టనర్‌తో పోరాడాలని ఊహించుకున్నాను.''

నేనూ ఊహించుకున్నాను మిత్రమా! నీ వేళ్ళు నా వీపు మీద అపురూపంగా అల్లుకున్న సుందర స్వప్నాల సుమాలవుతాయనీ, నీ చుబుకం నా భుజాల మీద గీసుకున్న అద్భుత తైలవర్ణ చిత్రం అవుతుందనీ. నీ గుండె చప్పుడు నా–

వద్దు. కొన్ని ఆలోచన్లు సజీవాకృతిని దాటకపోతేనే బావుంటుంది.

## 3

''**గుడ్‌మార్నింగ్** అమ్మా, బావున్నావా?'' ప్రతాపరెడ్డి కుర్చీలో కూర్చుంటూ అడిగాడు. శ్రీకళ్యాణి నవ్వి ఊరుకుంది. ఆమె మొహం ఒక వింత వెలుగుతో మెరిసిపోతూ ఉండటం అతను గమనించాడు. కొంచెంసేపు పిచ్చాపాటీ మాట్లాడాక అతను అన్నాడు ''డాక్టర్ ఏమన్నాడు?''

''ఫుడ్ పాయిజినింగ్ అఫెక్టు మొదట్లో చాలా ఎక్కువ ఉంటుందట. తరువాత దాని ప్రభావం కొద్దిగా తగ్గుతుందన్నారు. కొద్దిగా అంటే చాలా కొద్దిగా అన్నమాట! కనీసం చేతులు కదలొచ్చునన్నారు. ఆ తరువాత షాక్ ట్రీట్‌మెంట్లూ వగైరా ఇస్తే ఎప్పటికో... అంటే అయిదేళ్ళకో– పదేళ్ళకో మిగతా శరీరం కూడా బాగుపడొచ్చునన్నారు'' నవ్వింది.

ప్రతాపరెడ్డి ఆశ్చర్యంగా, కాస్త ఈర్ష్యగా చూశాడామెవైపు. ఆమెలో ఏ మాత్రం దిగులు కనిపించటం లేదు. రాత్రి శోభనం జరిగిందంటే నవ్వుకున్నారు. ప్రొద్దున్నకల్లా ఆ అమ్మాయి అరవిచ్చిన పువ్వులా ఇంత హాయిగా కనబడుతుందనుకోలేదు.

''వ్యాపారం విషయాలు ఏం చేశావమ్మా? సత్యం చూసుకుంటానన్నాడా?''

''సత్యమా? సత్యం ఎందుకండీ? మా ఆయనున్నారుగా. చిన్నపిల్లాడిని బడికి పంపినట్టు ఈరోజు ఆయన్ని ఆఫీసుకు పంపాను.''

''కోట్ల మీద వ్యవహారాల్ని చూసుకోవడానికి కార్తికేయని పంపావా? పాపం ఆ పెయింటర్ వ్యాపారం ఏం చూడగలడమ్మా? ఏదో బొమ్మలేసుకోగలడు గానీ.''

శ్రీకళ్యాణి నవ్వుతూ ''కష్టపడనివ్వండి. ఆయనకి అసలు డబ్బంటే ఇంటరెస్టు లేదు. ఈ విధంగానైనా మన ప్రపంచంలోకి రానివ్వండి'' అంది.

ప్రతాపరెడ్డి తటపటాయించి, '...అతనికి డబ్బంటే ఇంటరెస్ట్ లేదా? అంటే అంటే నువ్వు షిప్ ప్రమాదం నాటకమని చెప్పకముందే నిన్ను చేసుకుంటానన్నాడా?' అని అడిగాడు.

ఆ టాపిక్ ఇష్టం లేనట్టు ఆమె మొహం చిట్లించి ''అవును'' అంది. అతడు కాస్త ఆగి, ''ఇదంతా నీకు చెప్పవచ్చో లేదో తెలీదమ్మా. నేను కేవలం నీ ఉద్యోగుల మీద నిఘావేసే డిటెక్టివ్ అధికారిని మాత్రమే. నువ్వు కార్తికేయని చేసుకోబోతున్నావని తెలిసి, నన్ను క్షమించు... కాస్త ఎంక్వయిరీ చేశాను'' అన్నాడు.

''ఏం చేశారు?''

''షిప్ మునిగిపోలేదన్న వార్త అతడికి ఆ రాత్రే తెలుసు.''

''ఎలా తెలుసు?''

''తన రూమ్ పక్కనున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి అతను ఒక ట్రంక్‌కాల్ చేశాడు.''

''ఎక్కడికి?''

అతడు నెమ్మదిగా అన్నాడు ''బోంబే షిప్పింగ్ కంపెనీకి''.

శ్రీకళ్యాణి చాలాసేపు ఏమీ మాట్లాడలేదు. తరువాత తలెత్తి ప్రతాపరెడ్డి వైపు చూస్తూ ''ఆయన బోంబే ఎందుకు ఫోన్ చేశారో నాకు అర్థం కావటం లేదు. మీరేమయినా ఊహించగలరా?'' అని అడిగింది.

''చూడమ్మా! నేను డిటెక్టివ్ డిపార్టుమెంట్‌కి సంబంధించిన మనిషిని. నిజాలు తెలుసు కోవడమే గానీ, దాని వెనుక కారణాలు, ఉద్దేశాలు ఊహించలేను'' అన్నాడు.

''కానీ నేరస్తుడు ఏ ఉద్దేశంతో ఆ పని చేశాడన్నది ఓ డిటెక్టివ్‌గా మీరు ఊహించాలిగా''

ఈ మాటకి ప్రతాపరెడ్డి కంగారుపడి ''అబ్బెబ్బె, అతడు నేరస్తుడని కాదు'' అన్నాడు.

''మీ అంతట మీరు వెళ్ళి 'కార్తీక్ ఇల్లు ఎక్కడ? ఎక్కడ ఉంటాడు? ఆ వీధి చివర టెలిఫోన్ బూతు ఉన్నదా? అందులో రిజిష్టర్ ఉన్నదా? ఆ రిజిష్టర్‌లో కార్తికేయ బొంబాయి ఫోన్ చేసినట్టు ఉన్నదా?' ...ఇన్ని విషయాలు ఎంక్వయిరీ చేశారంటే మీకేదో అనుమానం కలిగిందన్నమాట. ఏమిటా అనుమానం? ఎప్పుడు కలిగింది?''

తను నడుము లోతు ఇరుక్కుపోయానని ప్రతాపరెడ్డికి తెలిసిపోయింది. ఇందులోంచి జాగ్రత్తగా బయటపడటం కోసం, ''చూడమ్మా! నువ్వు కోటీశ్వరురాలివి. నీ మీద లక్షల మందికి కళ్ళుండవచ్చు. నీకు దగ్గర కావడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉండొచ్చు. ఒక సెక్యూరిటీ ఏజెంటుగా వాళ్ళమీద కన్నేసి ఉండడం నా బాధ్యత కదా?''

''నేనడిగిన ప్రశ్నకి సమాధానం అదికాదు.''

''వళ్లంతా చచ్చుబడిన అమ్మాయిని వివాహం ఆడతానన్నప్పుడు వచ్చింది అనుమానం. ఆస్తంతా పోయిందన్నది నాటకం అని అతడికి తెలీదు కదా. మంచం మీద పడి ఉన్న బికారిని ఎవరయినా ఎందుకు చేసుకుంటారు? ఇన్ని అనుమానాలొచ్చి నేను ఎంక్వయిరీ చేశాను.'' సమర్ధించుకున్నట్టు అన్నాడు.

ఆమె టాపిక్ మారుస్తూ, ''ఆ విషాహారం గురించి ఏమైనా తెలిసిందా?'' అని అడిగింది.

''మిగతా రొయ్యలన్నీ బావున్నాయి. పోలీసులు ఆ హోటల్ వాళ్ళనీ, సర్వర్లనీ ప్రశ్నిస్తున్నారు. కేవలం ఆ ఒక్క ప్లేట్‌లోనే ఎవరో విషం కలిపినట్లు అనుమానం. విషం ఏమిటో తెలియటం లేదు కానీ స్వభావసిద్ధమైన, అంటే చెట్ల నుంచో, జంతువుల నుంచో వచ్చి కలిసిన విషం అంటున్నారు.''

''ప్రత్యేకం ఒక రొయ్య మాత్రమే సముద్రగర్భంలో ఏ విషపు చెట్టునో తిని ఉండొచ్చు. పొరపాటున దాన్నే నేను తిని ఉండొచ్చు.''

ప్రతాపరెడ్డి తల అడ్డంగా ఊపుతూ ''ప్లేట్‌లో అన్ని రొయ్యలూ అలాగే ఉన్నాయి. విషపు చెట్టు తిన్న రొయ్యలన్నీ ఒకే ప్లేట్ లోకి రావడం అసంభవం'' అన్నాడు. ఆమె సాలోచనగా చూస్తూ ఉండిపోయింది. ఆమె ఆలోచిస్తోందని గమనించి, కొంచెం ముందుకు వెళ్లి ''కార్తికేయ దాన్ని ముందు తిని ఉంటే, అతనే అటాక్ అయుండేవాడు'' అని ఆమె రియాక్షన్స్ కోసం ఎదురు చూశాడు.

''చాలా సేపు ఎవరమూ తినలేదు. మాట్లాడుకుంటూ ఉండిపోయాము'' అంది.

''అంటే...'' సందిగ్ధంగా అన్నాడు రెడ్డి ''నువ్వు తినేవరకూ అతను ఎదురు చూస్తున్నాడా?''

దట్టమైన గడ్డి అడుగునుంచి అకస్మాత్తుగా ఒక పామువచ్చి కాలి మీద కాటేసినట్టు ఆమె ఛివాలున తలెత్తింది.

''క్షమించమ్మా, నేనలా మాట్లాడాల్సింది కాదు.''

ఆమె ఒక నిర్ణయానికి వచ్చినట్టు ''ఆ టెలిఫోన్ బూత్ తాలూకు రిజిష్టర్ కాపీ మీ దగ్గర ఉన్నదా?'' అంది. అతను ఫైల్ లోంచి ఫోటో కాపీ తీసి అందించాడు.

''అందుకోవటానికి నాకు చేతులు లేవు. ఆ డ్రాయర్‌లో పెట్టండి. కనపడకుండా కాస్త నాలుగు పేపర్ల అడుగున ఉంచండి.''

## 4

జనరల్ మేనేజర్, ఫైనాన్స్, మార్కెటింగ్ మేనేజర్స్, కాస్ట్ అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సెక్రటరీ, మరో నలుగురు ఎగ్జిక్యూటివ్స్‌తో దాదాపు మూడు గంటల పాటూ చర్చలు జరిపాడు కార్తికేయ. ఒక్కొక్క విషయమూ నెమ్మదిగా ఆకళింపు చేసుకున్నాడు.

అతను ప్రశ్నలడిగే విధానం, దాన్నించి సమాధానం రాబట్టే వైనం అక్కడివారికి నచ్చింది. తమ యజమానురాలి శరీరం పారలైజ్ అయిందని తెలిసేసరికి ఈ పరిశ్రమల భవిష్యత్తు ఏమవుతుందా అని భయపడ్డారు. ఆపై తమ యజమానురాలు ఎవరో బీద చిత్రకారుడిని చేసుకోబోతున్నదనగానే సహజంగానే రకరకాల రూమర్లు వ్యాప్తి చెందాయి. ఇన్ని కోట్ల వ్యాపారాన్ని ఒక పెయింటర్ ఎలా నిర్వహిస్తాడని అనుకున్నారు. కానీ ఒక ప్రధానమంత్రి చనిపోగానే మరొకరు వచ్చి ఆదుకున్నట్టు కార్తికేయ ఏకాగ్రత వారికి నచ్చింది.

కార్తికేయ మాత్రం బాగా అలిసిపోయాడు. కళాకారుడు బిజినెస్సులో ఇమడలేదు. చేయలేక పోవడం వేరు. చేయడం ఇష్టం లేకపోవడం వేరు. తన పనులన్నీ ఏ మాత్రం పొరపాటు లేకుండా సరిగ్గా నిర్వర్తించి అతను కుర్చీ వెనక్కు జారబడ్డాడు.

అప్పుడొచ్చిందొక విజిటర్స్ కార్డు. అది చూడగానే అతను చప్పున లేచి నిలబడి తనే బయటికి వచ్చాడు. రిసెప్షనిస్టు పక్కనే కూర్చుని హస్కు కొడుతున్నాడు ఉస్మాన్. కార్తికేయ అలా హఠాత్తుగా హాలులోకి వచ్చేసరికి అందరూ బెదిరి నిలబడ్డారు. అతడు ఉస్మాన్‌ని స్వయంగా లోపలికి తీసుకెళ్ళాడు.

తన ఛాంబర్‌లో కూర్చున్నాక ''ఏమిటి ఉస్మాన్. ఇంత ఆనందప్రదమైన హఠాత్ దర్శనం?'' అని అడిగాడు కార్తికేయ.

ఉస్మాన్ అతని మాటలకు సమాధానం చెప్పకుండా చుట్టూ పరికించి చూస్తూ ''నువ్వు ఎంతయినా చెప్పు భాయ్. డబ్బు ఇచ్చినంత సంతోషం మరేదీ ఇవ్వదు'' అన్నాడు.

''అది కనుక్కోటానికా ఇంతదూరమొచ్చావ్'' అన్నాడు కార్తికేయ నవ్వుతూ.

''లేదు. రెండ్రోజుల క్రితం చిన్న చిత్రం జరిగింది. మన వీధిలో ఉన్న నా టెలిఫోన్ బూత్‌కి ఎవరో వచ్చారు. పోలీసులమని చెప్పి రిజిష్టర్ పట్టుకెళ్ళి గంట తర్వాత తెచ్చి ఇచ్చారట. నేనా టైమ్‌లో షాపులో లేను.''

''నేనేమయినా కనుక్కోనా? ఎవరు తీసుకెళ్ళారు? ఎందుకు తీసుకువెళ్ళారు అని...''

''అంత చిన్న విషయం కోసం నీ సమయం వృథా చేస్తానని ఎలా అనుకున్నావ్ భాయ్? నేనొచ్చింది ఎందుకంటే___'' ఆగి అన్నాడు. ''___ఆ పోలీసులమని చెప్పినవాళ్ళు వచ్చి వెళ్ళాక నాకేమీ అర్థంకాలేదు. ఆ రిజిష్టరంతా చూశాను.

ఆశ్చర్యమేసింది. కొన్ని రోజుల క్రితం నువ్వు బోంబే ఫోన్ చేసినట్టు ఉంది. నీ పేరెప్పుడూ నేను రిజిష్టర్‌లో వ్రాయను. అదీ గాక ఆ రాత్రి నేను బూత్‌లోనే ఉన్నాను. అన్నిటికన్నా ముఖ్యంగా అది నేను వ్రాసింది కాదు. నా పెన్ను నాకు బాగా గుర్తు. చేతివ్రాత కాపీ కొట్టినట్టు ఉంది గానీ, పెన్ను మాత్రం నాది కాదు.''

''ఆ బాంబే నెంబర్ ఏమిటి?'' అని అడిగాడు కార్తికేయ. బాగా కలత చెందినట్లు అతని మొహమే చెపుతోంది.

''అదెవరిదో తెలుసుకోకుండా ఉంటానా భాయ్'' జేబులోంచి కాగితం తీస్తూ అన్నాడు ఉస్మాన్. ''...అది ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్ కంపెనీ.''

కార్తికేయ భారంగా నిశ్వసించి ''థాంక్స్ ఉస్మాన్. చాలా సాయం చేసావ్'' అన్నాడు. మరికొంచెంసేపు మాట్లాడి ఉస్మాన్ వెళ్ళిపోయాడు. కార్తికేయ సిగ్మా ఏజెన్సీకి ఫోన్ చేశాడు. అట్నుంచి పీటర్ ఫోన్ ఎత్తగానే ''నేను కార్తికేయని. మీరొకసారి వెంటనే రాగలరా?'' అని అడిగాడు.

''ష్యూర్ సర్'' అన్నాడు పీటర్. అరగంట తరువాత వచ్చాడు. రావడం రావడమే ''నా క్రింద పని చేసిన కుర్రాడు ఈ విధంగా కోటీశ్వరుడు అవడం నాకు చాలా సంతోషంగా ఉంది సర్'' అంటూ వచ్చాడు. ఈ పరిణామాల పట్ల సంతోషించేవాళ్ళు కూడా కొందరున్నారన్నమాట' మనసులో అనుకున్నాడు. కార్తికేయ. కొంచెంసేపు మామూలు సంభాషణ అయ్యాక ''మీరు నాకు ఒక సహాయం చేసిపెట్టాలి'' అంటూ ఉస్మాన్ చెప్పిన వివరాలన్నీ చెప్పి, "మీరిదంతా సిగ్మా ఏజెన్సీ తరఫున కాకుండా నా స్నేహితుడుగా చేయాలి'' చివరి పదాన్ని వత్తి పలుకుతూ అన్నాడు.

''తప్పకుండా చేస్తాను'' పీటర్ లేచి నిలబడ్డాడు. ఎందుకో తెలీదు, అప్రయత్నంగా అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వెళ్తూ ఆగి, ''అయిదు రూపాయలు ఒంటెవాడికి ఇచ్చి నిన్ను ఎడారిలోకి పంపుతున్నప్పుడు గర్వంగా నవ్వుకున్నాను బాబూ. లక్ష రూపాయల సూట్‌కేసుతో నువ్వు వెనక్కి వచ్చి నా ఉద్యోగాన్ని నిలబెట్టినప్పుడు సిగ్గుతో తల వంచుకున్నాను. ఇప్పటికి నాకు నీ రుణం తీర్చుకునే అవకాశం లభించింది. మొత్తం నా తెలివితేటలన్నీ ఉపయోగించి నువ్వు చెప్పిన విషయాలన్నీ కనుక్కుంటాను'' అని అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

లంచ్‌కి ఇంటికి వెళ్ళాడు కార్తికేయ. ''ఎలా ఉంది కొత్త ఉద్యోగం?'' అడిగింది కళ్యాణి.

''చిరాగ్గా ఉంది'' నవ్వాడు కార్తికేయ. ''...ఒకళ్ళమీద మరొకరిని డిటెక్టివ్‌లుగా నియమించడం, అమాయకుల అజ్ఞానం మీద ఆడుకుంటూ వ్యాపారం చెయ్యడం.''

''ఒక్కరోజుకే ఇలా అయిపోతే ఎలా?'' అని, ''వ్యాపారం అంటే గుర్తుకొచ్చింది. మీకు బోంబేలో తెలిసిన వాళ్ళెవరయినా ఉన్నారా?'' అడిగింది.

''ఎవరూ లేరే.''

''ఏదైనా షిప్పింగ్ కంపెనీ?''

''తెలీదు. ఎందుకు అడుగుతున్నావ్?''

''ఏం లేదు. ఆ వ్యాపారంలోకి కూడా ప్రవేశిద్దామని'' అంటూ టాపిక్ మార్చింది. లంచ్ చేస్తూ ఉండగా పీటర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆ వివరాలు వింటూ ఉంటే కార్తికేయ ముఖ కవళికలు మారాయి. ఏం జరిగిందని కళ్యాణి అడిగితే ఏమీ లేదన్నాడు. ప్రతాపరెడ్డి ని ఆఫీసుకు రమ్మని, లంచ్ పూర్తి చేసి, అతను తిరిగి ఆఫీసు కొచ్చేసరికి రెడ్డి అతని కోసం ఎదురు చూస్తున్నాడు. ''నా కోసం కబురు చేశారట'' అన్నాడు.

''అవును. ఒక చిన్న ఇన్ఫర్మేషన్ కావాల్సి వచ్చి'' కార్తికేయ ఫైల్ సంతకం పెడుతూ అన్నాడు. ''సిగ్మా ఏజెన్సీస్ మూసేస్తున్నట్టు వార్త వచ్చింది. ఎంతవరకూ నిజం?''

''అలాటిదేమీ లేదే. బిజినెస్ లేదు. ఆ మాట నిజమే. కానీ మీ సంస్థలున్నాయి కదా. అవి చాలు.''

కార్తికేయ పెన్ను విదిలించాడు. ప్రతాపరెడ్డితో ''మీ పెన్ను ఒకసారి ఇస్తారా'' అని తీసుకుని మిగతా సంతకాలు పెట్టడం పూర్తిచేశాడు. ఈలోపు ఫోన్ మ్రోగింది. అట్నుంచి పీటర్. దాదాపు ఐదు నిమిషాలు మాట్లాడాడు. మొహంలో ఏ భావమూ మార్చకుండా అదంతా విని ఫోన్ పెట్టేసి రెడ్డితో ''ఊఁ చెప్పండి. మీ పెద్ద కొడుకు అమెరికా వెళ్లాడా?'' అని అడిగాడు.

''వెళ్లాడు.''

''మొన్న శుభలేఖ చూశాను. కూతురి పెళ్ళి కూడా అయిందనుకుంటాను.''

ఇన్ని క్షేమ సమాచారాలు అతను ఎందుకు అడుగుతున్నాడో అర్థంకాక ''అయింది. శ్రీకళ్యాణి కూడా వచ్చారు'' అన్నాడు.

''ఆమెకి అనుమానం రాలేదనుకుంటాను.''

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments